RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 66 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శనివారం 7-3-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥చవితి సా॥ 6.44, చిత్త ఉ ॥10.51, వర్జ్యం సా॥5.04 -6.48, దుర్ముహూర్తం ఉ॥6.18-7.52, శుభ సమయం ఉ॥ 7.30-9.00, రాహుకాలం ఉ॥9.00-10.30, సూర్యోదయం ఉ॥ 6.23, సూర్యాస్తమయం సా॥ 6.02 గం॥

## టిటిడి ఈవోగా ముద్దాడ రవిచంద్ర భాద్యతల స్వీకారం


8లో

## జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం

- వైసిపి వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం
- ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్
- పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- వైసిపి విద్యుత్ కొనుగోళ్లతో రూ.12,250కోట్ల నష్టం
- విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం
- రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం
- రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ మిగతా 2లో..



## 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు

**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చుని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే మిగతా 2లో..

## సివిల్స్ ఫలితాలు విడుదల

సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు... అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్




**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుదారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబర్లు.. 23385271, 23381125, 23098543 సంప్రదించాలని మిగతా 2లో..

## పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన

**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మిగతా 2లో..

## ఏపీలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ప్రోత్సహిస్తాం

మంత్రి నారా లోకేశ్



**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల వివరాలు, ఈఎంసీలో పరిశ్రమలకు ఇప్పటికే కేటాయించిన భూ విస్తీర్ణం, ఖాళీగా మిగతా 2లో..

## అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

ఇద్దరు పైలట్లు దుర్మరణం.... ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్



**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరుమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను మిగతా 2లో..

## మరోమారు బొత్సకు అస్వస్థత

- బిపి హెచ్చు తగ్గులతో అలసట
- వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు



**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మరోమారు అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ ఇబ్బందిపడటంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన మిగతా 2లో..

## 'చనిపోయిన' ఓటర్లను మీ ముందు నిలబెడతా

ఈసీపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత ఫైర్



**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో ధర్నా చేపట్టారు. భాజపా, ఎన్నికల సంఘం కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ ఈ సమగ్ర సవరణ అని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీని ఓడించాలనే కుట్రతోనే బెంగాల్లో హడావిడిగా సర్ ప్రక్రియ చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బతికి ఉన్న అనేక మంది ఓటర్లను సవరించిన ఓటర్ల జాబితాలో చనిపోయినట్లుగా తప్పుడుగా ప్రకటించారని మమత అన్నారు. చనిపోయినట్లు ఈసీ ప్రకటించిన వారిని తీసుకు వచ్చి ఎన్నికల కమిషన్ అధికారుల ముందు నిలబెడతానన్నారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి భాజపా ఎన్నికల కమిషన్‌ను పావులా వాడుకుంటోందని మమత ఆరోపించారు. వారి కుట్రను త్వరలోనే బయటపెడతానన్నారు. ఎన్నికలకు ముందు ఇటువంటి కుట్రలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 54 లక్షల మంది అర్హులైనవారి పేర్లను ఈసీ ఓటర్ల జాబితా నుంచి తొలగించిందని..దీనివల్ల అనేక మంది మైనారిటీ ఓటర్లు, వలస కార్మికులు నష్టపోయారన్నారు. ఏకపక్షంగా ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయని, తమ స్థానికతను నిరూపించుకోవడానికి బెంగాల్ ప్రజలకు ఒక్క అవకాశమూ ఇవ్వలేదని విమర్శించారు.

బుద్ధిని ఉన్నత విషయాలతో, అద్వితీయమైన ఆదర్శాలతో నింపుకోండి. రేయింబవళ్ళు వాటినే స్మరించండి. అప్పుడే అద్భుతాలను సాధించగలరు.

# సంఘ భవన దాతలకు రుణపడి ఉంటాం




**పలమనేరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రత్నారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రత్నారెడ్డి మాట్లాడుతూ.... మన సంఘ దాతలైన కుసుమ కుమారి క్రీ,శ, మునుస్వామి కుమార్తె ఉమారాణి జ్ఞాపకార్థంగా భవనము నిర్మించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. 20 సంవత్సరాలుగా మన ఆనవాయితీ ఉమారాణి జ్ఞాపకార్థంగా వారి చేసిన సేవలను కొనియాడారు. గత నెలలో మరణించిన సీనియర్ సభ్యులు సుబ్రమణ్యం పిళ్ళే ఆత్మ శాంతి కోసం సభ్యులు మౌనం పాటించారు. అనంతరం కుసుమకుమారి మాట్లాడుతూ... తమ బిడ్డ జ్ఞాపకార్థం పదిమందికి ఉపయోగపడేలా భవనం నిర్మించామని తెలిపారు. అనంతరం కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ..... లైఫ్ సర్టిఫికెట్ లో ఈనెల 18 వ తేదీ వరకు సమర్పించుటకు అవకాశం ఉందన్నారు. నేడు ప్రపంచం యుద్ధ వాతావరణంలో నిండిపోయింది దని విద్యార్థులు పౌరులు సైనికులు మరణించడం ప్రపంచ మానవాళికి జీవకోటి ఉనికి ప్రకృతి విధ్వంసానికి కారణమవుతుందని రాజీమార్గంలో యుద్ధం ముగించాలని కోరినారు. పిఆర్సి కమిషన్ వేసి ఐఆర్ 30 శాతంగా ప్రకటించాలని అనేక ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలు పోరాటాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ రెడ్డి, పోన్ముడి, విజయ్ కుమార్, శేఖర్, కస్తూరి, సోమ సుందరం రెడ్డి, పాండురంగయ్య, రాజారెడ్డి, శ్రీనివాసులు, సూర్యనారాయణ రెడ్డి, రాజన్న, సుబ్రహ్మణ్యం, బాలరాజు, దొరస్వామి నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పొలాలపై ఒంటరి ఏనుగు దాడి



**పలమనేరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు రూరల్ మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని కొంతమంది రైతుల పంటలపై గురువారం రాత్రి 8.30 గంటలకు ఒంటరి ఏనుగు గ్రామానికి ఆనుకుని ఉన్న అడవిలో నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు గ్రామానికి చెందిన వినాయకం అనే రైతు అతని భూమితో పాటు పక్కన ఉన్న భూమిని కూడా కౌలుకు తీసుకుని అందులో పశుగ్రాసం అరటి తదితర పంటలను సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి 8.30 గంటలకు పొలానికి ఆనుకుని ఉన్న అడవి నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు పశుగ్రాసం తోపాటు అరటి చెట్లను ధ్వంసం చేయడమే కాకుండా పైపులను ధ్వంసం చేసి పొలానికి వేసిన ఫెన్సింగ్ లను విరిచి నష్టం చేయడమే కాకుండా పక్కనున్న రైతుల పొలాల్లో మిరప పశుగ్రాసం తదితర పంటలను తిని ధ్వంసం చేస్తున్న సమయంలో తమ పొలాల వద్ద చాలా మంది ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న ఇళ్ల వద్ద కుక్కలు అరవడంతో అక్కడున్న రైతులందరూ ఈ ఏనుగును చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఏనుగు ఇళ్లపైకి వస్తే పిల్లాపాపలను.పాడి పశువులను ఎలా కాపాడుకోవాలని భయాందోళనలకు గురై గ్రామస్తులందరూ ఏనుగును తరిమెందుకు ప్రయత్నం చేశారు. కొందరు ఇళ్లపైకి ఎక్కి చూస్తున్నారు. కొందరు ఈ ఏనుగును తరిమెందుకు రాత్రంతా అనేక ప్రయత్నాలు చేశారు. కానీ అడవిలోనికి వెళ్ళలేదు. అష్ట కష్టాలు పడి తెల్లవారుజామున. అడవిలోనికి మళ్లీంచారు. వ్యవసాయానికి రాత్రిపూట కరెంటు ఇవ్వడం వలన రైతులు రాత్రివేళ తమ పొలాలకు నీరు పెట్టేందుకు ఏనుగుల వలన భయాలకు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. కాబట్టి ప్రభుత్వం స్పందించి పంట పొలాలపై ఏనుగులు రాకుండా తగు చర్యలు తీసుకుని అటవీ సమీపంలోని ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేపట్టాలని అదేవిధంగా తమ వ్యవసాయ భూములకు అటవి శాఖ అధికారుల ఆమోదంతో రైతులకు వంద శాతం పూర్తి సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ఎప్పటి నుంచో పలుమార్లు అధికారులకు తెలియపరుస్తున్నా కూడా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా పంట పొలాలపై ఏనుగులు రాకుండా ఇంద్రానగర్ నుంచి చెత్త పెంట గ్రామం వరకు సోలార్ ఫెన్సింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

## స్వచ్ఛంద సంస్థచే విద్యార్థులకు పరీక్షల కిట్స్ పంపిణీ




**ములకలచెరువు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తంబళ్లపల్లి నియోజకవర్గం, ములకలచెరువు మండల కేంద్రం వద్దగల కస్తూరిభా బాలికల గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు నాంది సోషల్ వెల్ఫేర్ ఎంపవర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పరీక్షల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ పసల ప్రసాద్ మాట్లాడుతూ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాసే పేద విద్యార్థులకు సంస్థ ద్వారా పరీక్షల ఇట్లు అందజేస్తూ విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమస్త ప్రెసిడెంట్ కొమ్ము ఉదయ్ కుమార్ సిబ్బంది సుబ్బారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సయ్యద్ బీ, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.


# యుద్ధాన్ని వెంటనే ఆపండి!

**- ప్రపంచ శాంతి కాపాడండి - ఐక్య రాజ్యసమితి జోక్యం చేసుకోవాలి**




**పలమనేరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇరాన్ తో అమెరికా ఇజ్రాయెల్ దేశాలు తలపడుతూ యుద్ధం కొనసాగిస్తున్న నేపథ్యంలో వేలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తక్షణం యుద్ధం ఆపేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యంచేసుకోవాలని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజన్ పేర్కొన్నారు భారత కమ్యూనిస్టు పార్టీ పుంగనూరు నియోజకవర్గ కమిటీ ని, అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం భగత్ సింగ్ కాలనీలో రామ్మూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి మహేష్, చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి టీ. జనార్దన్ లు హాజరయ్యారు. సమావేశం తొలుత ఇరాన్– అమెరికా ఇజ్రాయిల్ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్న పలువురు అమాయక ప్రజలకు సంతాపం తెలియజేసింది. అనంతరం జరిగిన సభలో నాగరాజు మాట్లాడుతూ.... ఒకనాడు అలీన దేశాలకు ప్రపంచ శాంతికి కేంద్ర బిందువుగా ఉన్న భారత ప్రభుత్వం యుద్ధాన్ని నివారించేందుకు ఒక దేశ అధ్యక్షుడిని మట్టు పెడితే ఖండించేందుకు గాని పూనుకోక పోవడం దుర్మార్గమన్నారు. యుద్ధం నివారించకపోతే అణుయుద్ధంగా రూపాంతరం చెంది ప్రపంచ మానవాళికే ముప్పు వాటిల్లుతుందనే విషయం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఐక్యరాజ్యసమితి సత్వరం జోక్యం చేసుకొని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.సిపిఐ అన్నమయ్య జిల్లా సెక్రెటరీ పి.మహేష్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ పాలనకు భిన్నంగా ఏమీ వ్యవహరించడం లేదని ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నారని విమర్శించారు. ప్రజా ఉద్యమాలను అణచి వేయాలనుకుంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు,టిడ్కోఇండ్లు, ఇంటి స్థలాలు కేటాయించడంలో జరిగే జప్యంపై ఉద్యమించాలని తెలిపారు.రాష్ట్రం విద్య వైద్యం పూర్తిగా ప్రైవేటుపరం చేస్తున్నారని కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు.ఈ నేధ్యంలో పార్టీ ఉద్యమం బలోపేతం చేసేందుకు నిర్మాణం కోసం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గడపగడపకు సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తూ నిధులు వసూలు చేసేందుకు కృషి చేయాలని పిలుపిచ్చారు. అనంతరం చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం పుంగనూరు చౌడేపల్లె, సోమల,సదుం మండలాలను అన్నమయ్య జిల్లా సిపిఐ సమితిలో విలీనం చేస్తున్నట్లు నాగరాజు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా సెక్రెటరీ మహేష్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గాన్ని తమ జిల్లాలో కి సాదరంగా ఆహ్వానిస్తూ జిల్లాలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి టి. కృష్ణప్ప, ఏఐటియుసి జిల్లా సెక్రటరీ ఎం సాంబశివ, రైతు సంఘం జిల్లా సెక్రెటరీ వి.రంగారెడ్డి ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా సెక్రెటరీ ఎం.మాధవ్ లు పాల్గొని ప్రసంగిస్తూ పుంగనూరు నియోజకవర్గంలోని పలు ప్రజాసంఘాలను అన్నమయ్య జిల్లాలోకి విలీనం చేసుకున్నట్లు ప్రకటించారు. అనంతరం అన్నమయ్య జిల్లా సెక్రెటరీ మహేష్ పుంగనూరు పట్టణంలో పార్టీ సీనియర్ సభ్యులు అయిన డా.టీ జనార్దన్ కు పార్టీ సభ్యత్వం అందజేశారు. సమావేశానికి పుంగనూరు సహాయ కార్యదర్శి మున్నా స్వాగతం పలకగా ఏఐటియుసి కార్యదర్శి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం



**తవణంపల్లి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు జిల్లా తవణంపల్లి మండల పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వినాయక విద్యా మందిర్ స్కూల్ విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై డాక్టర్ నాయక్ విద్యార్థినులతో మాట్లాడి ముందుగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థినులు చదువుల పట్ల మరింత శ్రద్ధ వహించాలని, అనవసరంగా మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.అలాగే బాలికల భద్రతకు సంబంధించిన గుడ్ టచ్--బ్యాడ్ టచ్ విషయాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినట్లయితే వెంటనే తల్లిదండ్రులు, గురువులు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, తల్లిదండ్రులు హెల్మెట్ వాడేలా పిల్లలే అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా తల్లిదండ్రులు, గురువులు మరియు పెద్దలతో గౌరవంగా మెలగాలని, గురువుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం, గొడవలకు దారి తీసే చర్యలు చేయకూడదని సూచించారు.విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలు నేరాలకు సంబంధించిన చట్టపరమైన సెక్షన్లు, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల రక్షణకు సంబంధించిన చట్టాల గురించి కూడా ఎస్సై వివరించారు.కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అపోలో యూనివర్సిటీలో ఘనంగా ఫార్మా అన్వేషణ్-2026



**చిత్తూరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మురకంబట్టులోని ది అపోలో యూనివర్సిటీ, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో "ఫార్మా అన్వేషణ్--2026" కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత ఫార్మసీ విద్యకు పితామహుడిగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ మహాదేవ లాల్ శ్రోఫ్ 124వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసీ రంగంలో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాకుండా పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ప్రెజెంటేషన్ నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్ రెడ్డి ఫార్మసీ రంగం ప్రస్తుతం ఔషధాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా డ్రగ్ డిస్కవరీ, క్లినికల్ రీసెర్చ్, ఫార్మాకోవిజిలెన్స్, వ్యక్తిగతీకరించిన వైద్యం, నానో టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు ఆధారిత ఔషధ పరిశోధనలు వంటి విభాగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిశోధన ప్రాజెక్టులు చేపట్టి, శాస్త్రీయ పత్రాలు ప్రచురించి, పరిశ్రమలతో కలిసి పనిచేసే దిశగా ముందుకు రావాలని సూచించారు. ఎఐఎంఎస్ఆర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సచ్చిదానంద అడిగ మాట్లాడుతూ ఈ ఏడాది థీమ్‌గా ఎంపిక చేసిన "ఫ్యూచర్ ఫార్మా ఎకోసిస్టమ్" ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి. జగదీషన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజశేఖర్, బయోమెడికల్ సైన్సెస్ హెచ్‌వోడి డాక్టర్ ఆర్. సత్యనారాయణ, అలైడ్ హెల్త్ సైన్సెస్ హెచ్‌వోడి డాక్టర్ సుచరిత పలగాటి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎం.ఎస్.రాజు, తిప్పేస్వామి భేటీ



**మడకశిర, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు , శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని అసెంబ్లీలో గురువారం ఉదయం కలిశారు. మడకశిర నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎం.ఎస్.రాజు, తిప్పేస్వామి వివరించారు. వాటితో పాటు నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 20నెలల కూటమి పాలనలో మడకశిరలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రికి వివరించారు. శ్రీసత్యసాయిజిల్లా మరియు మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తలు, అధికారుల మధ్య సమన్వయం వంటి అంశాలన్నింటిపై సీఎంకు పూర్తివివరాలు అందించారు. మడకశిర అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సానుకూల స్పందనపై ఎం.ఎస్.రాజు, తిప్పేస్వామి కృతజ్ఞతలు తెలియజేశారు.



# చిత్తూరు జిల్లా

## కనీస వేతనంగా రూ. 30 వేలు చెల్లించాలి

**- కలెక్టరేట్ ఎదుట గ్రామీణ సర్వేయర్ల ధర్నా**



**చిత్తూరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తమకు నెలకు కనీస వేతనంగా రూ 30 వేలు చొప్పున చెల్లించాలని గ్రామీణ సర్వేయర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా గ్రామీణ సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామీణ సర్వేయర్లు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు వినోద్ కుమార్, సోమశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో సమానంగా తమకు పే స్కేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు అత్యుత్తమ సేవలందిస్తున్న సర్వేయర్లు విధుల్లో చేరినప్పటి నుంచి చాలీచాలని వేతనాలతో కష్టించి పనిచేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా, పై అధికారులు మాత్రం ఎటువంటి విచారణ చేపట్టకుండా సర్వేయర్లనే బాధ్యులుగా చేసి షోకాజ్ నోటీసులు జారీ, పనిష్మెంట్లకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు నియమింపబడ్డ సచివాలయ ఉద్యోగులకు నెలకు రూ 30 వేలు చొప్పున వేతనం వస్తోందని, వారి కంటే అధికంగా కష్టపడే తమకు మాత్రం రూ 25 వేలు ప్రాతిపదికన బేసిక్ పే నిర్ణయించడం అన్యాయమని వాపోయారు. ఈ విషయమై తాము సర్వే శాఖ రాష్ట్ర కమిషనర్ కు విన్నవించినా ఫలితం లేదన్నారు. విధిలేని పరిస్థితుల్లో తాము ఈ నిరసన చేపట్టాల్సి వస్తోందని, ఇకనైనా ప్రభుత్వం, అధికారులు తమ దైన్య స్థితిని అర్థం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ కు వినతిపత్రం సమర్పించి, తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డిడి మాట్లాడుతూ వెంటనే గ్రామీణ సర్వేయర్ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామీణ సర్వేయర్లు తమ నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సర్వేయర్ల సంఘం నాయకులు షణ్ముగం, నరేష్, ప్రతాప్, పరిమళ, దీప్తి, భవ్యశ్రీ, విమలకుమారితో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రామీణ సర్వేయర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అపోలో యూనివర్సిటీలో మహిళా దినోత్సవ వేడుకల సందడి




**చిత్తూరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మురకంబట్టులోని ది అపోలో యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారతను ప్రోత్సహించే పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మహిళల శక్తి, సామర్థ్యాలను ప్రతిబింబించేలా వివిధ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం విమెన్ ఎంపవర్‌మెంట్ థీమ్‌తో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పోటీలలో విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని మహిళల శక్తి, గౌరవం, సమాజ నిర్మాణంలో వారి కీలక పాత్రను ప్రతిబింబించేలా సృజనాత్మక చిత్రాలను ఆవిష్కరించారు. మహిళల ఆత్మవిశ్వాసం, సమానత్వం, సాధికారతను ప్రతిబింబించిన రంగుల చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే విమెన్ ఎంపవర్‌మెంట్ థీమ్‌తో రీల్స్ మేకింగ్ పోటీ నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని మహిళల సాధికారతను ప్రతిబింబించే సృజనాత్మక వీడియోలను రూపొందించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం అపోలో నాలెడ్జ్ సిటీ క్యాంపస్‌లో వాకథాన్ నిర్వహించారు. మహిళల గౌరవం, సమాన హక్కులు, భద్రతపై సమాజంలో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అపోలో యూనివర్సిటీ, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్), అపోలో నర్సింగ్ కాలేజీ, అపోలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ), అపోలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ (ఏడబ్ల్యూఈసీ), ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గివ్ టు గైన్ – లింగ సమానత్వం సాధిద్దాం అనే నినాదంతో నిర్వహించిన ఈ వాకథాన్ మహిళల సాధికారత, లింగ సమానత్వం పట్ల సమాజంలో అవగాహన పెంపొందించేలా సాగింది.ఈ కార్యక్రమంలో అపోలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ హసీనా, కో కన్వీనర్ డాక్టర్ షాని ఎస్. ఎస్., ఐసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ హిమబిందు, ఎఐఎంఎస్ఆర్ స్టూడెంట్స్ అఫైర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణదీప్తి, అధ్యాపకులు, వివిధ విభాగాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళల సాధికారత, లింగ సమానత్వం సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## వైభవంగా సాగిన గట్టు వెంకటేశ్వర స్వామి రథోత్సవం



**రామసముద్రం, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామ సముద్రం, మండలం చెంబకూరు గ్రామంలో వెలిసిన శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి రథోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన భారీ రథంపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రథోత్సవాన్ని వీక్షించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగుతూ స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. రథోత్సవం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పురుగుమందు తాగి పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నం



**రామసముద్రం, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలంలోని వనగానపల్లికి చెందిన ఎస్. రాహుల్ (16) అనే పదో తరగతి విద్యార్థి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు రాహుల్ తల్లిదండ్రులు విభేదాలతో విడిపోయారు. దీంతో అతడు తన అవ్వ వద్ద ఉంటూ మండలంలోని కే.సి.పల్లె జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాహుల్ పురుగుమందు తాగాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ప్రస్తుతం అతనికి చికిత్స కొనసాగుతోంది. ఇదిలా ఉండగా గురువారం రోజే రాహుల్ పదో తరగతి హాల్ టికెట్ తెచ్చుకున్నాడని, అయినా ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడో అర్థం కావడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సిపిఐ నాయకులు



**కందుకూరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని జనార్దన్ స్వామి కల్యాణ మండపంలో గురువారం సీనియర్ రిపోర్టర్, సిపిఐ నాయకులు ఉప్పుటూరి మాధవరావు తనయుడు రవి కిషోర్ బాబుకి స్వాతితో వివాహం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కె.వీరారెడ్డి, బూసి సురేష్ బాబు, వై ఆనందమోహన్ లు శుక్రవారం మాధవరావు స్వగృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో ఉండాలని, వారి దాంపత్య జీవితం సజావుగా సాగాలని వారు దంపతులిద్దరిని ఆశీర్వదించారు.

# మహిళలపై నేరాలను మొదటి దశలోనే అరికట్టాలి

- మహిళల భద్రతలో సమాజం పాత్ర కీలకం - సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థినీ,విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ - సోషల్ మీడియా వినియోగంలో యువత జాగ్రత్తగా ఉండాలి : ఎస్పీ ధీరజ్ కునుబిల్లి





**మదనపల్లె, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళలపై నేరాలు చిన్న దశల నుంచి ప్రారంభమై పెద్ద నేరాలకు దారితీసే అవకాశం ఉన్నందున, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి మొదటి దశలోనే అరికట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు.శుక్రవారం పట్టణం లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ , ధీరజ్ కునుబిల్లి తో కలసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ఎక్కడైనా నేరాలు జరుగుతున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు, శక్తి టీంకు లేదా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాలని కోరారు. చిన్న స్థాయిలో కనిపించే నేరాలను అదే దశలో ఆపకపోతే అవి తరువాత పెద్ద నేరాలుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి ఒక్కరు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా ఇలాంటి విషయాలను వెంటనే తెలియజేయాలని అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిందని పేర్కొన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలను ఎక్కువ మంది ఉపయోగిస్తున్నారని తెలిపారు. నిరంతరం ఫోన్ సందేశాలు, సోషల్ మీడియా అప్డేట్లు చూస్తూ ఉండటం వల్ల వ్యక్తులు తమ పనులపై పూర్తిగా దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు.సాంకేతికత మనకు సహాయపడుతున్నప్పటికీ మన మేధస్సును పూర్తిగా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ఎంత అభివృద్ధి చెందినా మానవ మేధస్సుకు ప్రత్యామ్నా యం కాదని తెలిపారు. మనం స్వయంగా ఆలోచించడం, మెదడును ఉపయోగించడం తగ్గిస్తే దీని ప్రభావం భవిష్యత్తులో మానవ సమాజంపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.విజ్ఞాన శాస్త్రంలో ఉన్న పరిణామ సిద్ధాంతం ప్రకారం మనం ఉపయోగించని అవయవాలు క్రమంగా పనికిరాని స్థితికి చేరుతాయని చెప్పారు. అదే విధంగా మన మెదడును తక్కువగా ఉపయోగిస్తే దాని ప్రభావం భవిష్యత్తులో మన జీవిత విధానంపై పడే అవకాశం ఉందని హెచ్చరించారు.కాబట్టి సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంతో పాటు మన ఆలోచనా శక్తిని, దృష్టి కేంద్రీకరణను పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. అలాగే సమాజంలో భద్రతను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలని కోరారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా అనేక తప్పుడు ఖాతాలు, తప్పుడు సమాచారాలు సులభంగా సృష్టించబడుతున్నాయని తెలిపారు. ఫోటోలు, సందేశాలు మరియు సంభాషణలను సులభంగా రూపొందించవచ్చని, కృత్రిమ మేధస్సు సహాయంతో కూడా సందేశాలను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. కాబట్టి సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కొన్ని సోషల్ మీడియా వేదికల్లో అసభ్యకరమైన కంటెంట్ అధికంగా వ్యాప్తి చెందుతున్నందున విద్యార్థులు అలాంటి విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తమ భవిష్యత్ లక్ష్యాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోరగా పుంగనూరుకు చెందిన ఒక విద్యార్థిని ప్రస్తుతం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్నానని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకు లేచి కరెంట్ అఫైర్స్, సివిక్స్ వంటి విషయాలను క్రమంగా చదువుకుంటున్నానని ఆమె చెప్పగా సభలో ఉన్నవారు చప్పట్లతో అభినందించారు. జీవితంలో ఒక స్థాయికి చేరుకోవడం అనేది కార్డులతో రాజభవనం నిర్మించడంలాంటిదని, ఒక్కో మెట్టు జాగ్రత్తగా నిర్మించాలి, చిన్న తప్పిదం జరిగినా మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.ప్రస్తుతం యువతలో వేగంగా వాహనాలు నడపడం, చెడు అలవాట్లు అలవాటు చేసుకోవడం వంటి కారణాలతో కొంతమంది చిన్న వయసులోనే కేసుల్లో ఇరుక్కుంటున్నారని, ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో పాస్‌పోర్ట్ పొందడం, పోలీస్ వెరిఫికేషన్ పొందడం కష్టమవుతుందని, ప్రభుత్వ ఉద్యోగాలు దాదాపు అసాధ్యమవుతాయని వివరించారు. ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీలు కూడా ఉద్యోగాల నియామకంలో క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌ను పరిశీలిస్తున్నాయని తెలిపారు.అదేవిధంగా మహిళలు, పిల్లలు, యువతిపై ఎటువంటి వేధింపులు, అన్యాయాలు లేదా నేరాలు జరిగినా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. పోక్సో కేసులు, ఈవ్ టీజింగ్, సైబర్ స్టాకింగ్, అత్యాచారాలు వంటి మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మహిళలు మరియు పిల్లలకు భద్రమైన సమాజాన్ని అందించేందుకు అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ ఎప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సహకారం కూడా అవసరమని కోరారు. చివరగా విద్యార్థులందరూ తమ భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు.అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ విధి నిర్వహణలో విద్యార్థిని, విద్యార్థులు మరియు యువతి యువకుల ప్రేమ పెళ్లిల జీవితం గురించి తమకు ఎదురైన అనుభవాలను విద్యార్థులకు తెలియజేస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలతో విద్యార్థినీ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో తయారుచేసిన గుడ్ టచ్,బ్యాడ్ టచ్ షార్ట్ ఫిలింను, వివిధ ప్రదేశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ఫోటోలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎం. వెంకటాద్రి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శంకర మల్లయ్య, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, శక్తి టీం ఎస్సై గాయత్రి , పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## ఏఐ,ఎం.ఎల్,డేటా సైన్స్ రంగాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి

- మిట్స్ వర్శిటీలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ ఫర్ లెర్నింగ్ ప్రోగ్రాం



**మదనపల్లె /కురబలకోట, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం వారు ఏఐసిటిఈ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి),న్యూఢిల్లీ వారి సహకారంతో రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ ఫర్ లెర్నింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెంగళూరుకు చెందిన టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ సి.పి రవికుమార్,మలేషియా దేశానికి చెందిన యూనివర్సిటీ అఫ్ మలయా,కంప్యూటర్ సిస్టం అండ్ టెక్నాలజీ విభాగం నందు పనిచేస్తున్న డాక్టర్ రాష రజేబ్ అతల్లాహ్,జపాన్ దేశంలోని ది యూనివర్సిటీ అఫ్ ఐజు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాగే ఉదయ్ కిరణ్,పోలాండ్ దేశానికి చెందిన యూ.బి.ఎస్ బిజినెస్ సొల్యూషన్స్ సంస్థ ప్రోడక్ట్ మేనేజర్ ఈ.ఆర్ రాంకుమార్ సెల్వరాజ్ పాల్గొని,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ సి.పి రవికుమార్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ మరియు డేటా సైన్స్‌లో పనిచేస్తున్న అకాడెమియా మరియు పరిశ్రమలకు చెందిన పరిశోధకులు,ఇంజనీర్లు మరియు శాస్త్రవేత్తలను వారి అప్లికేషన్‌లను ఒకచోట చేర్చడానికి ఒక ప్రధాన అంతర్జాతీయ సమావేశానికి నాందిగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు.నేటి కంప్యూటింగ్ వ్యవస్థలు వేగంగా మరియు సమర్థవంతంగా పనిచేయడానికి ఆప్టిమైజేషన్ పద్ధతులు ఎంతో అవసరమని తెలిపారు.సెమీకండక్టర్ టెక్నాలజీ అభివృద్ధిలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం,ప్రాసెసింగ్ వేగాన్ని పెంచడం,వ్యవస్థ పనితీరును మెరుగుపరచడం వంటి అంశాల్లో ఆప్టిమైజేషన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.అనంతరం డాక్టర్ రాగే ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో ఉండే అనేక మంది పరిశోధకులు ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలు చేస్తున్నారని,మెషిన్ లెర్నింగ్ తో మొదలుకొని,డేటా సైన్స్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలలో దిన దినాభివృద్ధి జరుగుతున్నాయని,టెక్నాలజీ పరంగా ఎంతో ముందుకు వెళుతున్నాయని ఆయన అన్నారు.పరిశోధన పత్రాలు ప్రఖ్యాతి పొందిన ఐఈఈఈలో ప్రచురణ చేయడం వారి కెరీర్ కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఎంతోమంది పరిశోధకులు వారి పరిశోధన పత్రాలు ఇక్కడ ప్రదర్శించడం,వారి ఆలోచనలను అందరితో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్,డీన్ - స్కూల్ అఫ్ కంప్యూటింగ్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా,విభాగాధిపతి డాక్టర్ ఎమ్.శ్రీదేవి,కన్వీనర్ డాక్టర్ ఆర్.నిత్య,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు

- 16 మూటల రేషన్ బియ్యం సీజ్ : కేసులు నమోదు



**మదనపల్లి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె పట్టణంలోని రైస్ మిల్లులకు రేషన్ బియ్యం అక్రమంగా తరలించి,సొమ్ము చేసుకుంటున్నారన్న ఫిర్యాదులపై శనివారం కడప విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ సీఐ శివన్న ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేపట్టారు.స్థానిక ఎస్టేట్‌లో ఉన్న రెండు రైస్ మిల్లులపై దాడులు చేపట్టిన అధికారులు రైస్ మిల్లులలో సోదాలు చేశారు.రైస్ మిల్లులో ఉన్న బియ్యాలపై కెమికల్స్ చెల్లి పిడిఎస్ రైస్ ఉన్న ఆనవాళ్లను వెలికి తీశారు.అందులో ఒక రైస్ మిల్లులో 11 మూటలు బయటపడగా,మరో రైస్ మిల్లులో ఐదు మూటల పిడిఎస్ రైస్ బయటపడ్డాయి.సుమారు రూ.32,000 విలువ చేసే 800 కిలోల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు.ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ శివన్న మాట్లాడుతూ మాకు రాబడిన సమాచారం మేరకు ఎస్పీ ఆదేశాలతో మదనపల్లెలోని రెండు రైస్ మిల్లుల్లో పిడిఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని అభియోగంపై తనిఖీలు చేపట్టామన్నారు.ఈ దాడుల్లో సుమారు 800 కిలోల బియ్యం పట్టుబడిందని వీటిని పంచనామా నిమిత్తం సిఎస్ డీటి ఫైరోజ్ ఖాన్ కు అప్పగిస్తున్నామన్నారు.రేషన్ బియ్యం ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తుంటే,కొందరు అక్రమార్కులు వాటిని సొమ్ము చేసుకుంటున్నారని,వీరిపై కొరడా ఝులిపిస్తామన్నారు.ప్రస్తుతం రేషన్ బియ్యాన్ని మిల్లుకు విక్రయించడానికి వచ్చిన వ్యక్తిపైన,ఈ రైస్ కొనుగోలు చేసిన రెండు రైస్ మిల్లులపైన కేసులు నమోదు చేస్తున్నామన్నారు.ఈ దాడులు మరింతగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ దాడుల్లో సీఐ శ్రీనివాసులు,డిసిటిఓ బాబు మోజస్,సిఎస్ డిటి ఫైరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## బి.టి.కళాశాలలో స్వస్థతపై 2వ రోజు కొనసాగిన కార్యశాల

- రిసోర్స్ పర్సన్‌గా హాజరైన డాక్టర్ జి.అజ్మతుల్లా ఖాన్

**మదనపల్లె, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు జరిగతున్న స్వస్థత (వెల్నెస్ బీయింగ్) కార్యశాల రెండవ రోజు (శుక్రవారం) ఆసక్తికరంగా కొనసాగింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు హార్ట్ ఫుల్ నెస్ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యశాలకు రిసోర్స్ పర్సన్ గా హార్ట్ ఫుల్ నెస్ ఆర్గనైజేషన్ నుండి విచ్చేసిన డాక్టర్. జి.అజ్మతుల్లా ఖాన్ ఈ రోజు సమయపాలన,సరైన నిర్ణయం,సరైన ప్రయత్నం అనే అంశాలు జీవితంలో విజయానికి ఎలా సోపానాలుగా ఉపయోగపడతాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చక్కగా వివరించి చెప్పారు.నిజ జీవితంలోని సంఘటనలను ఉదహరిస్తూ చేసిన ఆయన ప్రసంగం,చేయించిన ధ్యానాభ్యాసం విద్యార్థులను,అధ్యాపకులు బాగా ఆకట్టుకున్నాయి.కార్యశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గన్నవరం శ్రీదేవి,హార్ట్ ఫుల్ నెస్ ఆర్గనైజేషన్ నుండి పి.ప్రమీల,పి.సుజాత,ఎన్.రాఘవ రెడ్డి,అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి,కళాశాల అధ్యాపకులు డాక్టర్ శైలజ సి.ఎస్.డాక్టర్ శ్రీనివాస్ దేరంగ్,డాక్టర్ జి.చిన్నారెడ్డి తదితర అధ్యాపకులు పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌పై పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం

**పీలేరు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు పట్టణంలోని 11వ జిల్లా కోర్టు హాల్లో శుక్రవారం (06.03.2026) సాయంత్రం ఐదు గంటలకు పోలీస్ అధికారులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. రానున్న మార్చి 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి అవసరమైన ఏర్పాట్లపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులను సమీక్షించి, రాజీ ద్వారా పరిష్కరించగల కేసులను గుర్తించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు. ముఖ్యంగా పాత క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలకు సంబంధించిన వివాదాలు, మెయింటెనెన్స్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు వంటి అంశాల్లో ఇరు పక్షాల వారిని సంప్రదించి, పరస్పర చర్చల ద్వారా సమస్యలను పరిష్కార దిశగా తీసుకెళ్లాలని కోరారు.అదేవిధంగా చిన్నపాటి పిటీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు వంటి వాటిని కూడా జాతీయ లోక్ అదాలత్‌లో అధికంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు న్యాయం త్వరగా అందేలా, కోర్టుల్లో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించేలా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈ సమావేశంలో తెలిపారు.ఈ సమావేశంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి శ్రీమతి శారద, రాయచోటి డిఎస్పీ, పీలేరు సీఐ, చౌడేపల్లి సీఐ, వివిధ మండలాల ఎస్సైలు, ఎక్సైజ్ ఎస్సైలు, ఏడీజే కోర్టు ఏపీపీ శివప్రసాద్ రెడ్డి,శ్రీమతి శారద, కోర్టు కానిస్టేబుళు తదితరులు పాల్గొన్నారు.సమావేశం ముగింపులో అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేసి జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నిర్ణయించారు.

## ఆదిత్యలో ప్రారంభమైన ఫ్యూజన్ - 2026 టెక్నో కల్చరల్ ఫెస్ట్

- హాజరైన కేపీఎంజీ డెలివరీ నెట్‌వర్క్ డైరెక్టర్ మంజునాథ్ బాపూజీ




**మదనపల్లె, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ అయిన ఫ్యూజన్ 2026 మార్చి 6న అనగా శుక్రవారం జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా ప్రారంభించారు. అనంతరం కార్యదర్శి మరియు కరస్పాండెంట్ ఆర్.రామమోహన్ రెడ్డి ఈ యొక్క ఫెస్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంజునాథ్ బాపూజీ డైరెక్టర్ కేపీఎంజీ డెలివరీ నెట్‌వర్క్ ఇండియా,బెంగళూరు,ప్రస్తుత యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాముఖ్యత,పని భవిష్యత్తులో మార్పు,ఉద్భవిస్తున్న ఉద్యోగ అవకాశాలు మరియు నేటి ప్రపంచంపై చాట్ జీపీటీ మరియు జెమిని వంటి ఏఐ అప్లికేషన్ల ప్రభావంపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు.డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగా రెడ్డి,విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికను అందించడానికి జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియంలను నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు విద్యా సంవత్సరంలో నిర్వహించిన వివిధ విద్యా మరియు సహ పాఠ్య కార్యక్రమాలను మరియు విద్యార్థులపై వాటి సానుకూల ప్రభావాన్ని హైలైట్ చేశారు.కన్వీనర్ డాక్టర్ ఎస్.మునిరత్నం,సాంకేతిక సమ్మేళనాలతో వినూత్న పరిష్కారాలకు దారితీస్తుందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రం లోపల,వెలుపల నుండి దాదాపు 1500 మంది ఈ ఫెస్ట్‌లో పాల్గొన్నారని తెలిపారు.మొదటి రోజు,పేపర్ ఫ్యూజన్,కోడ్ ఫ్యూజన్ మరియు హ్యాక్‌స్ప్రింట్ వంటి సాంకేతిక కార్యక్రమాలు,గ్లామ్ వాక్ మరియు డ్యాన్స్ ఫీవర్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.విద్యార్థులు తమ సాంకేతిక మరియు సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించడానికి ఈ ఫెస్ట్ ఒక శక్తివంతమైన వేదికగా మారింది.

## జేఏసీ రథసారదులుగా సి.రెడ్డిశేఖర్,పోకల మధుసూదన

- రాష్ట్ర జేఏసి ఆదేశాలను అమలు చేస్తామని స్పష్టం



**మదనపల్లె, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ జేఏసీ మదనపల్లె యూనిట్ ఛైర్మనుగా సి.రెడ్డిశేఖర్, జనరల్ సెక్రటరీ పోకల మధుసూదన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్జీవో హోం నందు జరిగిన కార్యవర్గ సమావేశంలో మదనపల్లె యూనిట్ జేఏసీ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.కో - ఛైర్మన్లుగా ఎం.శివ ప్రసాద్, నరసింహారెడ్డి,రవి ప్రకాష్, నరసింహులు,విజయ్ కుమార్,చలపతి, మధురవాణి,జి.నాగరాజు,విజయ్ కుమార్ రెడ్డి,ఆర్థిక కార్యదర్శిగా శశి శేఖర్,ఉపాధ్యక్షులుగా బి.టి.నరసింహులు,కె.హేమలత, ఎమ్.అశోక్,భాస్కర్, బి.వెంకటరమణ, రాజేశ్వరి,రెడ్డెప్ప రెడ్డి,రమాదేవి, రామచంద్రారెడ్డి,గిరివర్ధన్ నాయుడు,మోహన్ రెడ్డి,సుధాకర్, ఎన్.విజయ్ కుమార్ రెడ్డి,చిన్నప్ప జాయింట్ సెక్రటరీలుగా సి.భాస్కర్ రెడ్డి,ఎం.వెంకటరమణ, లీలావతి,శేఖర్ రెడ్డి,రవీంద్ర,గోపాల్,టి.నాగరాజు,ఆనంద రెడ్డి,విద్యాధరరావు,కే. విజయ,మోహన్,పి.వెంకటయ్య, రవి నాయక్ ఒక్కొక్క ఉద్యోగ సంఘం నుండి ఒక్కొక్కరిని కార్యవర్గంలోకి తీసుకోవడం జరిగింది. నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఏ కార్యక్రమమైనా మదనపల్లెలో విజయవంతం చేస్తామన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక,పెన్షనర్ల హక్కుల కోసం,ఉద్యోగులకు రావలసిన న్యాయమైన ప్రయోజనాల కోసం పోరాడుతామన్నారు.

## జ్వరాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి: డీఎమ్‌హెచ్‌వో

**కమలాపురం, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా కమలాపురం లో శుక్రవారం నిర్వహించిన "డ్రై డే ఫ్రైడే" కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నాగరాజు కమలాపురంలోని గండ్లూరు కాలనీని సందర్శించారు. కాలనీలోని ప్రజలతో మాట్లాడి జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఇంటి పరిసరాలలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా జ్వరంతో బాధపడితే ఆర్ ఎం పి డాక్టర్లను సంప్రదించకుండా, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని ప్రజలకు తెలిపారు. చికిత్స కోసం కమలాపురం సీహెచ్ సీ ఆసుపత్రి లేదా యుపీహెచ్ సీ మార్కెట్ యార్డ్ హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించారు.ఈ కార్య క్రమంలో, వెంకటరెడ్డి యూపీహెచ్ సిబ్బంది, లక్షు మయ్య, ఆశా వర్కర్లు పాల్గొని ప్రజలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన కె.వేణుగోపాల్ (జెసిబి వేణు)

- స్వయంగా పరిచయం చేసిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా



**మదనపల్లె ,మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మదనపల్లె నియోజకవర్గం, పొన్నేటిపాళ్యం పంచాయతీకి చెందిన తెలుగుదేశం నేత కొల్లె వేణుగోపాల్ (జెసిబి వేణు) శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల విరామ సమయంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యమంత్రికి జెసిబి వేణును స్వయంగా పరిచయం చేశారు.తెలుగుదేశం పార్టీకి జెసిబి వేణు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే సీఎంకు వివరించగా ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే విజనరీ ముఖ్యమంత్రి పేరుగాంచిన చంద్రబాబును కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.సీఎం మాటతీరు,హుందాతనం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు.అదేవిధంగా నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించడం ఎప్పటికీ మర్చిపోలేనన్నారు.ఆయన సూచనలు, సలహాలు రాజకీయంగా తనకు ఎంతో దోహదపడతాయన్నారు.ఎమ్మెల్యేతో కలిసి సమిష్టిగా పనిచేసి నూతన జిల్లా కేంద్రమైన మదనపల్లె అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా అసెంబ్లీలో మదనపల్లె అభివృద్ధి కోసం తగినన్ని నిధులు మంజూరు చేయాలని,పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గళం వినిపించడం ప్రశంసనీయమని కొనియాడారు.ఎమ్మెల్యే సారధ్యంలో మదనపల్లె గణనీయమైనా అభివృద్ధి సాధించడం ఖాయమని వేణు ధీమా వ్యక్తం చేశారు.

## నందిగామ పాత బస్టాండ్ వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి...



నందిగామ మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : నందిగామ పాత బస్టాండ్ సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేయడం కలకలం రేపింది. నందిగామ నుంచి జగ్గయ్యపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ కిరణ్ కుమార్ విధుల్లో ఉండగా బస్సులోకి ఎక్కిన ఒక వ్యక్తి ఆకస్మికంగా ఆయనపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొందరు ప్రయాణికులు వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. దాడిలో డ్రైవర్ కిరణ్ కుమార్ స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. అనంతరం ఆయన నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. దాడికి కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు. బస్సులో ఉన్న ప్రయాణికుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో ఆర్టీసీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్ల భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## నందిగామ వై జంక్షన్ వద్ద పోలీసుల విస్తృత తనిఖీలు...



నందిగామ మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : పట్టణంలోని వై జంక్షన్ వద్ద గురువారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ తిలక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై చర్యలు తీసుకున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నవారిని పోలీసులు ఆపి విచారణ చేశారు. సరైన వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి భారీగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనాల పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. తనిఖీల కారణంగా కొంతసేపు వై జంక్షన్ ప్రాంతంలో వాహనాల రద్దీ కనిపించింది. అయితే రోడ్డు భద్రత కోసం ఇటువంటి తనిఖీలు అవసరమని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వైవీఎల్ నాయుడు మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని చెప్పారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు తరచూ నిర్వహిస్తామని తెలిపారు.

## పకడ్బందీగా జనగణన

### శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



నరసరావుపేట మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పిలుపునిచ్చారు. నరసరావుపేట లోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మొదటి దశ 'గృహాల జాబితా మరియు గృహ వసతుల గణన' శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించి, శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి కృతిక శుక్లా మాట్లాడుతూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మార్చి 6 నుండి 8 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ శిక్షణలో జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. "మన గణన -- మన భవిష్యత్తు" అనే నినాదంతో జరుగుతున్న ఈ మహా యజ్ఞం దేశ ప్రగతికి దిక్సూచి వంటిదని, సేకరించే ప్రతి అంకె అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది అని స్పష్టం చేశారు. గృహ నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, ఇంటర్నెట్ వంటి 33 కీలక అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉంటుందని, సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం చట్టరీత్యా బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణ ప్రియ ,జిల్లా రెవెన్యూ అధికారి నారదముని ,ఆర్డీవో మురళి కృష్ణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి వాసంశెట్టి రాజీనామాకు ఏఐటీయూసీ డిమాండ్




కాకినాడ మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడులో 28 మంది మృతికి బాధ్యత వహిస్తూ కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజీనామా చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబాలకు రూ. 50 లక్షల పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నాయకులు కేసీ బాదుల్లా కోరారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని వారు మండిపడ్డారు.

హోమ్ఆంధ్రప్రదేశ్అనంతపురం జిల్లాహిందూపురం

## హిందూపురంలో ఓపెన్ హౌస్ నిర్వహించిన పోలీసులు



కడప మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, శుక్రవారం హిందూపురం వన్ టౌన్ ఎస్సై శ్రీధర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, మహిళల భద్రత, పోక్సో చట్టం, వైర్లెస్ సెట్ పనితీరు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



రాయదుర్గం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : అనంతపురం జిల్లా రాయదుర్గం లోని ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రూ.4 కోట్లు, కణేకల్లు సబ్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడ్ని కోరారు. మిర్చి, శనగలు, చింతపండు, కందులు తదితర వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ మార్కెట్ యార్డు ఛైర్మన్ యు. హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

## రైతులు ఉద్యాన పంటలను సాగుచేయాలి



విజయనగరం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : అత్యధిక లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలనే రైతులు సాగు చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భోగాపురం మండలంలో కలెక్టర్ పర్యటించారు. కొయ్యపేటలో రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. పొలాల్లో దిగి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగు చేస్తున్న పద్ధతులు, మార్కెట్ సదుపాయం తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి స్థానంలో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, పూల సాగు ద్వారా నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ఉద్యాన సాగు వైపు మళ్లే రైతులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా వారు పండించిన పంటలకు మార్కెట్ సదుపాయంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తామన్నారు. అత్యధిక దిగుబడి కోసం సంప్రదాయ సాగు పద్ధతులకు బదులు ఆధునిక విధానాలను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఉద్యాన శాఖ డీడీ చిట్టిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి హైమవతి, ఉద్యాన అధికారి ఉమాభారతి తదితరులు ఉన్నారు.

## వేసవిలో నీటి కష్టాలు రాకుండా చూడాలి: ఎమ్మెల్యే బత్తుల



రాజానగరం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణం చేపట్టాల్సిన కీలక పనుల ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను శుక్రవారం ఆదేశించారు. RWS DEE, AEలతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి, చక్రద్వార బందం, వెలుగుబంద, ఫరిజల్లిపేట గ్రామాలలో బోర్ వెల్, ఆర్.ఓ. ప్లాంట్, అవసరమైన చోట్ల పైపు లైన్ నిర్వహణకు అంచనాలు రూపొందించాలని సూచించారు. ఈ చర్యల ద్వారా వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలని ఆయన తెలిపారు.

## ఇంగ్లండ్‌పై భారత్ థ్రిల్లింగ్ విజయం.. ఫైనల్లో న్యూజిలాండ్‌తో పోరు...

**టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్**

**శాంసన్ ఒత్తిడిలో బుమ్రా సూపర్ బౌలింగ్**

**253 చేసినా.. చెమటోడ్చిన టీమిండియా**




నందిగామ మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు టీమిండియా వరుసగా రెండోసారి అర్హత సాధించింది. వెస్టిండీస్, అమెరికా వేదికగా జరిగిన టోర్నీలో సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై ఉత్కంఠభరిత విజయం సాధించిన భారత్ ముచ్చటగా మూడోసారి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అయినప్పటికీ ఈ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో టీమిండియా చెమటోడ్చింది. ఇంగ్లండ్ ఓపెనర్ జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105; 8 ఫోర్లు, 7 సిక్సర్లు) చివరి వరకూ పోరాడాడు. చివరి ఓవర్లో ఇంగ్లండ్‌కు 30 పరుగులు అవసరమైన దశలో బెతెల్ రనౌట్ కావడం మ్యాచ్‌కు మలుపు తిప్పింది. ఆ తర్వాతి బంతికి ఒక్క పరుగే రావడంతో భారత్ విజయం ఖాయమైంది. చివరి మూడు బంతులను జోఫ్రా ఆర్చర్ సిక్సర్లుగా మలిచినా అప్పటికే ఫలితం మారలేదు. ఈ మ్యాచ్‌లో సంజు సామ్సన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ నిర్ణయం బెడిసికొట్టింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (9) త్వరగా ఔటైనా వికెట్ కీపర్ బ్యాటర్ సంజు సామ్సన్ చెలరేగి ఆడాడు. కేవలం 42 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 89 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. ఇషాన్ కిషన్ (39; 18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి రెండో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అనంతరం శివమ్ దూబే 25 బంతుల్లో 43 పరుగులు చేయగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 11 పరుగులకే వెనుదిరిగాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27) మరియు తిలక్ వర్మ (7 బంతుల్లో 21) దూకుడుగా ఆడడంతో భారత్ స్కోరు 253కు చేరింది.

భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్‌కు శుభారంభం దక్కలేదు. సాల్ట్, బ్రూక్, బాంటన్ త్వరగా ఔటైనా బట్లర్ (25)తో కలిసి బెతెల్ పోరాటం కొనసాగించాడు. సెంచరీతో జట్టును గెలుపు దిశగా నడిపించినా చివర్లో వికెట్లు కోల్పోవడంతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు తీసుకోగా బుమ్రా, అర్ష్‌దీప్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ దక్కించుకున్నారు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్ న్యూజిలాండ్‌తో తలపడనుంది.

టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్‌లో భారత్ భారీ స్కోరు సాధించడంలో సంజు సామ్సన్ మెరుపు బ్యాటింగ్ కీలకమైంది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ నిర్ణయాన్ని అతడు తప్పు చేశాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రం పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ రెండో ఓవర్లోనే ఔటయ్యాడు. అయితే శాంసన్ జోరు ఏమాత్రం తగ్గలేదు. పేసర్ జోఫ్రా ఆర్చర్ షార్ట్ బంతులతో పరీక్షించినా అతడు ధైర్యంగా ఎదుర్కొన్నాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఫైన్ లెగ్ వైపు భారీ సిక్స్ బాదుతూ తన దూకుడును చూపించాడు. 15 పరుగుల వద్ద బ్రూక్ క్యాచ్ వదిలేయడంతో లభించిన అవకాశాన్ని శాంసన్ పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ కేవలం 26 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ కూడా దూకుడుగా ఆడడంతో స్కోరు వేగంగా పెరిగింది. ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 9వ ఓవర్లోనే భారత్ స్కోరు 100 దాటింది.

ఇషాన్ ఔటైన తర్వాత శివమ్ దూబేతో కలిసి శాంసన్ మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించాడు. వీరిద్దరి దూకుడుతో 13 ఓవర్లకే భారత్ 160/2తో బలమైన స్థితిలో నిలిచింది. అనంతరం శాంసన్ ఔటైనా దూబే, తిలక్ వర్మ (21), హార్దిక్ పాండ్యా (27) వేగంగా పరుగులు సాధించారు. చివరి ఐదు ఓవర్లలో భారత్ ఏకంగా 86 పరుగులు రాబట్టి భారీ స్కోరు నమోదు .

మలుపుతిప్పిన అక్షర్ క్యాచ్...

భారత ఇన్నింగ్స్‌లో సంజు సామ్సన్ క్యాచ్‌ను ఇంగ్లాండ్ ఫీల్డర్లు వదిలేయడం మ్యాచ్‌కు కీలక మలుపైతే.. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ క్యాచ్ కూడా అంతే కీలకంగా మారింది. జాకబ్ బెతెల్‌తో కలిసి జాక్స్ విలువైన భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఇంగ్లాండ్ వైపు తిప్పే ప్రయత్నం చేశాడు. ఈ జోడీ మరికొంతసేపు క్రీజులో నిలిచుంటే ఫలితం మారిపోయే పరిస్థితి కనిపించింది. అయితే అర్ష్‌దీప్ సింగ్ వేసిన 14వ ఓవర్ చివరి బంతికి జాక్స్ కవర్స్ వైపు భారీ షాట్ ఆడాడు. దూరం నుంచి పరుగెత్తుకొచ్చిన అక్షర్ పటేల్ అద్భుతంగా బంతిని అందుకున్నాడు. అయితే వేగాన్ని అదుపులో పెట్టుకోలేకపోయిన అక్షర్ చురుకుగా స్పందించి తన ముందున్న శివమ్ దూబే వైపు బంతిని విసిరాడు. వెంటనే దూబే క్యాచ్ అందుకోవడంతో జాక్స్ ఔటయ్యాడు. అధికారికంగా క్యాచ్ దూబే ఖాతాలోకి వెళ్లినా.. ఆ వికెట్‌కు అసలు క్రెడిట్ అక్షర్‌కే దక్కింది.

అంతకుముందు కూడా హ్యారీ బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ సుమారు 28 మీటర్లు వెనక్కి పరుగెత్తి అద్భుతంగా పట్టుకున్నాడు. కీలక సమయంలో అతడి ఫీల్డింగ్ భారత్ విజయానికి పెద్ద కారణమైంది.

బుమ్రా ఆల్టైమ్ బెస్ట్ బౌలర్: బ్రూక్


ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ప్రశంసలతో ముంచెత్తాడు. బుమ్రా అత్యుత్తమ బౌలర్ అని, చాలా కాలంగా ప్రపంచంలోనే ఉత్తమ బౌలర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడని పేర్కొన్నాడు. "బుమ్రా అద్భుతమైన బౌలర్. అతడు ఆల్టైమ్ బెస్ట్. కీలక సమయంలో అతడి బౌలింగ్ మ్యాచ్‌పై ప్రభావం చూపింది" అని అన్నాడు.

భారత ఆటగాళ్ల ఫీల్డింగ్ కూడా అద్భుతంగా ఉందని బ్రూక్ చెప్పాడు. ముఖ్యంగా అక్షర్ పటేల్ అందుకున్న క్యాచ్ తన జీవితంలో చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటని కొనియాడాడు. "ఆ క్యాచ్ నిజంగా అద్భుతం. భారత ఆటగాళ్లకు హ్యాట్సాఫ్" అని బ్రూక్ అభినందించాడు.

ఆ మెరుపులు ఫైనల్ కోసం దాచుకున్నాడా?..అభిషేక్

గత నెల భారీ అంచనాలతో టీ20 ప్రపంచకప్ బరిలోకి దిగిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మ టోర్నీలో మాత్రం తీవ్రంగా నిరాశపరిచాడు. విరాట్ కోహ్లీ లేని ఈ టోర్నీలో అతడు స్టార్ బ్యాటర్‌గా ఎదుగుతాడని అభిమానులు ఆశించారు. గత ఏడాది ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్న అభిషేక్.. తన కెరీర్‌లోనే అతి పెద్ద టోర్నీలో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. గ్రూప్ దశలో కూడా అతడి ప్రదర్శన ఆశాజనకంగా లేకపోయింది. జింబాబ్వేపై అర్ధశతకం సాధించడం తప్ప టోర్నీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. కీలకమైన దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ మ్యాచ్‌ల్లో వరుసగా 15, 10 పరుగులకే పరిమితమయ్యాడు. సెమీఫైనల్‌లో అయినా చెలరేగుతాడని భావించిన అభిమానులకు మరోసారి నిరాశే మిగిలింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో రెండు ఫోర్లు కొట్టినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేక త్వరగా పెవిలియన్ చేరాడు. వెస్టిండీస్ మ్యాచ్ తరహాలోనే స్పిన్ బౌలింగ్‌లో ముందుకు వచ్చి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో మిడ్ వికెట్‌లో విల్ జాక్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. స్పిన్ బౌలింగ్‌లో స్లో డెలివరీలకు అతడు బలహీనంగా ఉండటాన్ని గుర్తించిన ఇంగ్లండ్ ప్రణాళికాబద్ధంగా అతడిని ఔట్ చేసినట్టు స్పష్టమైంది. అభిమానులు ఊహించని విధంగా అభిషేక్ వరుస వైఫల్యాలు ఎదుర్కొన్నాడు. మరి ఫైనల్లో అయినా తనదైన శైలిలో చెలరేగి జట్టుకు ఉపయోగపడతాడేమో చూడాలి

## నిబంధనలు 'గాలి'కి.. బాణాసంచా విక్రయాలు 'జోరు'గా



చిలకలూరిపేట మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : వేటర్లంపాడు ఘటన పల్నాడు జిల్లా యంత్రాంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. పసుమర్రు, బొప్పూడి గ్రామాల సర్వే నెంబర్లలో వెలసిన బాణాసంచా దుకాణాలపై పోలీస్, ఫైర్, రెవెన్యూ విభాగాలతో కూడిన జాయింట్ కమిటీ మెరుపు దాడులు నిర్వహించింది. అయితే, ఈ తనిఖీల్లో వెల్లడైన అంశాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్న ఈ షాపుల్లో కనీస రక్షణ ప్రమాణాలు మృగ్యమయ్యాయి.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ అంటే ఏమిటి? ఎందుకు లేదు?

నిబంధనల ప్రకారం.. బాణాసంచా విక్రయదారులు వ్యాపారం ప్రారంభించే ముందు రెండు కీలక అనుమతులు పొందాలి: ప్రొవిజనల్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (చీూజ): ఇది ప్రాథమిక అనుమతి మాత్రమే. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్: షాపులో ఇసుక, అలారం, స్ప్రింక్లర్లు, హైడ్రెంట్ సిస్టమ్ వంటి అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశాక, అధికారులు తనిఖీ చేసి ఇచ్చే అంతిమ అనుమతి పత్రం.

అయితే, చిలకలూరిపేట మండల పరిధిలోని ఏ ఒక్క పెద్ద షాపుకు కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేదని జిల్లా అధికారి శ్రీధర్ స్పష్టం చేయడం గమనార్హం. కేవలం తాత్కాలిక అనుమతులతోనే ఏళ్ల తరబడి వ్యాపారాలు సాగిస్తుండటం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది.

తుతూమంత్రంగా భద్రతా ఏర్పాట్లు ప్రమాదం జరిగితే అదుపు చేయడానికి ఉండాల్సిన పరికరాలు ఈ షాపుల్లో నామమాత్రంగా కూడా లేవు.. నీటి కుంటలే దిక్కు: ఫైర్ ఇంజన్లు, ఎలక్ట్రికల్ పంపులు ఉండాల్సిన చోట.. కేవలం చిన్న పైపులు, అక్కడక్కడా ఉన్న నీటి కుంటలతోనే సరిపెట్టారు. ప్రొవిజనల్ మాయ: రెండేళ్ల నుండి వ్యాపారం చేస్తున్న ఒక షాపు యాజమాని, కనీసం ప్రొవిజనల్ సర్టిఫికెట్ కూడా లేకుండా ఇప్పుడు తనిఖీలు వస్తున్నాయని పైపులు అమర్చుతుండటం అధికారులను ఆశ్చర్యపరిచింది. అలారాలు లేవు.. ఇసుక లేదు: అగ్నిప్రమాదం సంభవిస్తే హెచ్చరించే అలారాలు గానీ, మంటలు ఆర్పే ఇసుక బకెట్లు గానీ ఎక్కడా కనిపించలేదు.

ప్రాణాలతో చెలగాటం

దీపావళి సీజన్ కావడంతో ఈ షాపులకు ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఒకవేళ చిన్న నిప్పు రవ్వ పడినా, అక్కడ ఉన్న అట్టపెట్టెల మధ్య ప్రాణనష్టం ఊహించలేనంత భారీగా ఉండే అవకాశం ఉంది. "లైసెన్స్ ఉన్న మాకేం కాదు" అనే ధీమాతో యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల స్పందన : నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని జిల్లా ఫైర్ అధికారి తెలియజేశారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా వ్యాపారం చేయడం చట్టవిరుద్ధం. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయి అధికారులు కూడా తనిఖీలు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## ఆదర్శ కుటుంబంలో అదిరిపోయే ట్విస్టులు



పెద్దగా హడావిడి చేయకుండా, సైలెంటుగా షూటింగ్ జరుపుకుంటున్న క్రేజీ సినిమాల్లో ఆదర్శ కుటుంబం ఒకటి. వెంకటేష్, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న ఈ మూవీకి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్రేకుల్లేకుండా ప్లానింగ్ కు అనుగుణంగా షూట్ చేసేస్తున్నారు. అక్టోబర్ రెండు విడుదలని టార్గెట్ గా పెట్టుకున్నట్టు టాక్ ఉంది కానీ దీన్ని ఇప్పట్లో అధికారికంగా ప్రకటించకపోవచ్చు. వేసవి నుంచి ప్రమోషనల్ అప్డేట్స్ వదలాలని నిర్ణయించుకున్నారట. ఇది పక్కనపెడితే పైకి టైటిల్ సాఫ్ట్ గా ఉన్నా క్యాప్షన్ లో ఉన్న ఏకే 47కు తగ్గట్టు ఇందులో యాక్షన్ ఎలిమెంట్స్ బలంగా ఉంటాయని ఇన్ సైడ్ టాక్. ఇంటర్వెల్ వరకు సరదాగా సాగుతూ, మల్లీశ్వరి -- నువ్వు నాకు నచ్చావ్ తరహాలో ఫన్ నడిపిస్తూ ఒక్కసారిగా ఇంటర్వెల్ బ్లాక్ దగ్గర పెద్ద మలుపు పెట్టారని వినికిడి. ఇక్కడి నుంచి కథా గమనం మారిపోయి మహేష్ బాబు అతడు తరహా ట్రీట్ మెంట్ తో మాటల మాంత్రికుడు మరోసారి తనదైన మార్కు బయటకి తీస్తారని యూనిట్ లీక్. గుంటూరు కారంలో జరిగిన పొరపాట్లకు ఈసారి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా అల వైకుంఠపురములో ప్లస్ అతడుని కలగలిపి దానికి వెంకీ మార్కు టైమింగ్ జోడిస్తే అదే ఆదర్శ కుటుంబం అంటున్నారు. అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా రూపొందుతోందట. ఈ కాంబో కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూసిన మూవీ లవర్స్ కోరికకు అనుగుణంగా పర్ఫెక్ట్ అవుట్ ఫుట్ వస్తోందని అంటున్నారు. త్రివిక్రమ్ కు ఆదర్శ కుటుంబం బ్లాక్ బస్టర్ కావడం చాలా అవసరం. ఎందుకంటే నెక్స్ట్ ప్లాన్ చేసుకున్న ప్యాన్ ఇండియా మూవీకి బజ్ మరింత పెరగాలంటే దీంతో అదిరిపోయే హిట్టు కొట్టాలి. గాడ్ అఫ్ వార్ (ప్రచారంలో ఉన్న టైటిల్) జూనియర్ ఎన్టీఆరా లేక అల్లు అర్జునా అనే ప్రచారానికి ఇంకా చెక్ పడలేదు కానీ మే నెలలో తారక్ పుట్టినరోజు సందర్భంగా ఒక క్లారిటీ రావొచ్చని అంటున్నారు. యానిమల్, అర్జున్ రెడ్డి ఫేమ్ హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్న ఈ యాక్షన్ కం ఫ్యామిలీ డ్రామాలో మ్యూజిక్ కూడా హైలైట్స్ లో ఒకటిగా నిలుస్తుందట.

## ఆలస్యం అమృతమవుతుందా మహాశయా



విపరీతమైన పోటీలో సంక్రాంతి పండక్కు విడుదలైన భర్త మహాశయులకు విజ్ఞప్తి అద్భుతాలు చేయకపోయినా గత రవితేజ డిజాస్టర్లతో పోలిస్తే బెటరనే స్పందన, వసూళ్లు తెచ్చుకుంది. రాజా సాబ్ ని పక్కనపెట్టి ర్యాంకింగ్ వేసుకుంటే మన శంకరవరప్రసాద్ గారు, అనగనగా ఒక రాజు, నారి నారి నడుమ మురారి తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. దీన్ని బట్టి ఆడియన్స్ రెస్పాన్స్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. సరే రిజల్ట్ సంగతి పక్కన పెడితే ఒక్క విషయంలో భర్త మహాశయులకు విజ్ఞప్తి రోల్ మోడల్ గా నిలుస్తోంది. అతి ఆలస్యంగా 59 రోజుల తర్వాత మార్చి 13 నుంచి ఓటిటి స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటిదాకా డిజిటల్ లో రాకపోవడం ఆశ్చర్యమే. ఇంత లేట్ వెనుక కారణం నిర్మాణ సంస్థ ఒప్పందం కాదని ఇన్ సైడ్ టాక్. వేర్వేరు రీజన్స్ వల్ల ఓటిటి వైపు నుంచే జాప్యం జరిగిందని అంటున్నారు. అసలే ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చ జరుగుతోంది. టాలీవుడ్ సినిమాలు ఏవైనా థియేటర్, ఓటిటి మధ్య కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల గ్యాప్ ఉండాలనే ప్రతిపాదన మీద నిర్మాతల మండలి సీరియస్ గా విశ్లేషణ చేస్తోంది. సాధ్యాసాధ్యాల గురించి డిస్కషన్లు జరుగుతూనే ఉన్నాయి. ఇలా చేయడం వల్ల చిన్న నిర్మాతలు నష్టపోతారని, పెద్ద ప్రొడ్యూసర్లు సైతం రెవిన్యూలో అధిక భాగం కోల్పోవాల్సి వస్తుందని, ముఖ్యంగా డిజాస్టర్లకు పెద్ద దెబ్బ పడుతుందని రకరకాల అభిప్రాయాలు వినపడుతున్నాయి. ఇలాంటి టైంలో భర్త మహాశయులకు విజ్ఞప్తి లేటుగా ఓటిటి ఎంట్రీ ఇవ్వడం ఆసక్తి రేపుతోంది. ఒకవేళ వ్యూస్ కనక భారీగా వస్తే అదో సానుకూల సంకేతంగా చూడొచ్చు. ఎందుకంటే థియేట్రికల్ గా భారీ వసూళ్లు తేని సినిమా రెండు నెలల తర్వాత కూడా డిజిటల్ లో జనాన్ని ఆకట్టుకుందంటే ఖచ్చితంగా ఆలోచించాల్సిన విషయం అవుతుంది. హిందీ, మలయాళం లాగా మనమూ లేట్ విండో అమలు చేయాలని అగ్ర నిర్మాతలు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. అసాధ్యం కాదు కానీ అందరికీ ఒప్పించడం పెద్ద సవాల్ లాంటిది. ఏకాభిప్రాయం వస్తే పరిశ్రమకు మంచిదే. కాకపోతే ఓటిటిలు ఎలా రియాక్ట్ అవుతాయనేది చూడాలి.

## ‘ఉస్తాద్’ తప్పు దిద్దుకున్న బుక్ మై షో



ఒక బ్రేక్ తర్వాత సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చాక వరుసగా రీమేక్ సినిమాలే చేస్తూ వచ్చాడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. అభిమానులతో పాటు ప్రేక్షకుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనా ఆయన పట్టించుకోలేదు. ఐతే ఈ రీమేక్ పరంపరకు గత ఏడాది బ్రేక్ పడింది. స్ట్రెయిట్ సినిమాలు హరిహర వీరమల్లు, ఓజీలతో ప్రేక్షకులను పలకరించాడు. వీటిలో తొలి సినిమా నిరాశపరిచినా.. రెండో చిత్రం మంచి ఫలితాన్నందుకుంది. ఇక పవన్ చేతిలో ఉన్న ఏకైక చిత్రం.. ఉస్తాద్ భగత్ సింగ్. ఇది తమిళ బ్లాక్ బస్టర్ ‘తెరి’కి రీమేక్ అనే అభిప్రాయంతోనే మొదట్నుంచి అందరూ ఉన్నారు. కానీ ‘ఉస్తాద్..’ రీమేక్ కానే కాదంటూ ఇటీవలే దర్శకుడు హరీష్ శంకర్ నొక్కి వక్కాణించాడు. నా సినిమాలో ఒక ఎపిసోడ్‌ను తమ చిత్రంలో పెట్టుకున్న ‘తెరి’ మూవీని నేనెందుకు రీమేక్ చేస్తా, ‘కథ-మాటలు-దర్శకత్వం’ అని కార్డ్ ఎందుకు వేసుకుంటా అని ఆయన ప్రశ్నించారు. దీంతో ఇది స్ట్రెయిట్ మూవీనేలే అని ఫ్యాన్స్‌లో ఉత్సాహం వచ్చింది. ఐతే స్వయంగా దర్శకుడే మీడియా ఇంటర్వ్యూల ద్వారా ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చాడు కానీ.. బుక్ మై షో వాళ్లు మాత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’ రీమేకే అని సంకేతాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ప్రతి సినిమాకు బుక్ మై షోలో సినాప్సిస్ ఇవ్వడం కామనే. చాలావరకు అది చిత్ర బృందం నుంచి తీసుకున్న సమాచారమే ఉంటుంది. ఐతే ‘ఉస్తాద్..’ కథా సారాంశం గురించి చెబుతూ.. ఒక ఐపీఎస్ అధికారి తన కూతురితో కలిసి అజ్ఞాతావాసంలో ఉంటాడని.. అంతకుముందు అతడి కుటుంబాన్ని కొందరు నాశనం చేస్తారని.. ఒక సందర్భంలో తన ఐడెంటిటీ బయటపడిపోవడంతో మళ్లీ తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఆ అధికారి ఏం చేశాడన్నది ఈ కథ అని అందులో పేర్కొన్నారు. ఈ సినాప్సిస్ ‘తెరి’దే అని ఆ సినిమా చూసిన వాళ్లందరికీ అర్థమైపోతుంది. దీంతో హరీష్ ఒకవైపు రీమేక్ కాదు మొర్రో అంటుంటే.. బీఎంఎస్ వాళ్లు మాత్రం ఇది ‘తెరి’ రీమేక్ అన్నట్లుగా సినాప్సిస్ ఇవ్వడమేంటి అని పవన్ ఫ్యాన్స్ అయోమయంలో పడిపోయారు. సోషల్ మీడియాలో దీని గురించి చర్చ జరిగింది.




## చైతూ విలన్... బాలీవుడ్ సందీప్ వంగ!



కొందరు సినీ ప్రముఖులు మాట్లాడుతుంటే అందరూ అలెర్ట్ అవుతారు. వాళ్ల మాటతీరు భయం గొల్పేలా ఉంటుంది. ఎప్పుడూ ఫైర్ మీద ఉన్నట్లుగా కనిపించే ఆ వ్యక్తులు.. ఎప్పుడు ఏం చేస్తారో అన్నట్లుగా కంగారు పుట్టిస్తుంటారు. ‘అర్జున్ రెడ్డి’తో టాలీవుడ్లో సెన్సేషన్ క్రియేట్ చేసి... కబీర్ సింగ్, యానిమల్ మూవీస్‌లో బాలీవుడ్‌లోనూ ప్రకంపనలు రేపిన సందీప్ రెడ్డి వంగ ఈ కోవకే చెందుతాడు. ప్రెస్ మీట్లలో, ఇంటర్వ్యూల్లో, స్టేజ్ మీద మాట్లాడేటపుడు సందీప్ చాలా సీరియస్‌గా కనిపిస్తుంటాడు. తనకు ఎవరైనా బ్రేక్ వేయాలని చూస్తే గట్టి పంచ్ వేయడానికి వెనుకాడడు. ఇప్పుడు సందీప్ రెడ్డి వంగను గుర్తు చేసేలా ఒక యువ నటుడు మాట్లాడ్డం సోషల్ మీడియా దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ నటుడి పేరు.. స్పర్శ్ శ్రీవాస్తవ. ఇతను బాలీవుడ్ క్లాసిక్ ‘లాపతా లేడీస్’తో నటుడిగా చాలా మంచి పేరు సంపాదించాడు. అందులో అమాయకమైన పల్లెటూరి భర్త పాత్రలో స్పర్శ్ అదిరిపోయే పెర్ఫామెన్స్ ఇచ్చాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్.. త్వరలోనే టాలీవుడ్లోకి అడుగు పెడుతున్నాడు. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య హీరోగా రూపొందుతున్న ‘వృష కర్మ’లో స్పర్శ్ విలన్ పాత్ర చేశాడు. నిన్న రిలీజ్ చేసిన టీజర్లో అతనే హైలైట్ అయ్యాడు. టీజర్లోనే జనాలను భయపెట్టేశాడు స్పర్శ్.


ఐతే తెర మీదే కాదు.. బయట కూడా అతను జనాలను కాస్త కంగారు పెట్టేలాగే మాట్లాడాడు. టీజర్ లాంచ్ కార్యక్రమంలో అతను చాలా సీరియస్ స్పీచ్ ఇచ్చాడు. ఐతే స్పర్శ్ ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నానంటూ ఇంగ్లీషులో మాట్లాడుతుంటే.. ఆడిటోరియంలో ఉన్న లేడీ జర్నలిస్ట్ గట్టిగా ఇంగ్లిష్ వద్దు అని చెప్పడంతో తను హిందీలో మాట్లాడడం మొదలు పెట్టాడు.. మళ్ళీ వెంటనే ఆవిడ అడ్డుచెప్పడంతో... నేను హిందీలో మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే.. మీరు అడ్డుతగులుతున్నారంటూ.. వచ్చి మీరే మాట్లాడుకోండి అనేశాడు స్పర్శ్. దీంతో అక్కడ వాతావరణం కొంచెం వేడెక్కింది. స్పర్శ్ హావభావాలు, మాటతీరు చూస్తే అక్కడ ఉన్న వాళ్లకు సందీప్ రెడ్డి వంగనే గుర్తుకొచ్చాడు. బాలీవుడ్లోనూ ఒక వంగ ఉన్నాడంటూ.. యానిమల్ బీజీఎం వేసి కొందరు ఈ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండడం విశేషం.



# బిజినెస్ న్యూస్



## 25వేల బడ్జెట్‌లో ఫోన్ చూస్తున్నారా? మోటో నుంచి కొత్త ఫోన్



ఎడ్జ్ సిరీస్ ఫోన్లతో ఇండియన్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో తనకంటూ ప్రత్యేక మార్క్ సంపాదించిన మోటోరొలా.. ఎడ్జ్ 70 సిరీస్‌లో కొత్త ఫోన్‌ను లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీతో ఎడ్జ్ 70 ఫ్యూజన్‌ను విడుదల చేసింది. రూ.25 వేల బడ్జెట్‌లో పేరొందిన బ్రాండ్‌లో మంచి స్మార్ట్‌ఫోన్ కోసం చూస్తున్నవారు ఈ ఫోన్‌ను పరిశీలించొచ్చు. ఇంతకీ ఈ ఫోన్ ఎలా ఉంది? అప్‌డేట్స్ మాటేంటి? మోటోరొలా ఎడ్జ్70 ఫ్యూజన్ 6.78 అంగుళాల సూపర్ హెచ్‌డీ 1.5ఖ ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ డిస్‌ప్లేతో తీసుకొచ్చారు. 144 ఎఓ, హెచ్‌డీఆర్ 10ం, 5,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో ఈ డిస్‌ప్లే పనిచేస్తుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటక్షన్ ఉంది. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 4 ప్రాసెసర్ ఇచ్చారు. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత హెలోయూఐతో పనిచేస్తుంది. 3 ఏళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ-710 ప్రధాన కెమెరా ఉంది. 13 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 3 ఇన్ 1 లైట్ సెన్సర్ ఇచ్చారు. ముందువైపు 32 ఎంపీ కెమెరా ఉంది. ఇందులోని 7000 ఎంఏహెచ్ బ్యాటరీ 68ఔ టర్బోపవర్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. దీని బరువు 193 గ్రాములు. ఇక ధర విషయానికొస్తే.. మోటో ఎడ్జ్ 70 ఫ్యూజన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ 128జీబీ వేరియంట్ రూ.26,999, 8జీబీ 256జీబీ వేరియంట్ ధర రూ.29,999, 12జీబీ 256జీబీ వేరియంట్ ధర రూ.32,999గా నిర్ణయించారు. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లపై రూ.2 వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. లేదా పాత ఫోన్ ఎక్స్ఛేంజీపై రూ.2వేలు అదనంగా ఇస్తోంది. దీంతో ఈ ఫోన్ ధర రూ.24,999 నుంచే ప్రారంభమవుతుంది. మార్చి 12 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటో వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. నేటి (మార్చి 6న) మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఫ్లిప్‌కార్ట్‌లో ఎర్లీబర్డ్ సేల్ నిర్వహించనున్నారు.


## టెస్లా కార్లకు యాక్సిస్ బ్యాంక్ లోన్లు




ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లాకు ప్రిఫర్డ్ ఫైనాన్సర్‌గా వ్యవహరించే దిశగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. దీనితో దేశవ్యాప్తంగా టెస్లా కస్టమర్లకు ప్రత్యేక రుణ సదుపాయాలను అందించనున్నట్లు వివరించింది. ప్రధాన నగరాలు, వర్ధమాన ఈవీ హబ్‌లలో డిజిటల్ ఫైనాన్సింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ప్రీమియం ఈవీ కొనుగోలుదారుల కోసం అనువైన రీపేమెంట్ పథకాలు, గరిష్ఠంగా 10 ఏళ్ల రుణ వ్యవధి, డిజిటల్ ఆన్‌బోర్డింగ్ మొదలైన సౌకర్యాలతో రుణాలను అందించనున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఈడీ మునీష్ శర్దా తెలిపారు. ఈ భాగస్వామ్యంతో టెస్లా వాహనాల కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. కస్టమర్లు డీలర్‌షిప్‌ల వద్దే లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తక్షణ రుణ ఆమోదం పొందే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో భారతదేశంలో ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడంతో పాటు ఈవీ మార్కెట్ విస్తరణకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## బేర్ మళ్లీ వచ్చింది: భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్‌లు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో లాభాలు చవిచూసిన సూచీలు.. ఒక్కరోజు తిరగక ముందే మళ్లీ బేర్ గుప్పిట్లోకి వెళ్లాయి. సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 24,500 మార్కు దిగువన ముగిసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం ముమ్ముందు మరింత తీవ్ర రూపం దాలుస్తుందన్న భయాలు సూచీలను పడేశాయి. ‘అసలు కథ ఇప్పుడే మొదలైందంటూ’ అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలు దీనికి ఆజ్యం పోశాయి. సెన్సెక్స్ ఉదయం 79,658.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,015.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఆరంభంలో ఓ మోస్తరు నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఆఖర్లో మరింత అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో ఇంట్రాడేలో 78,812.18 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1097 పాయింట్ల నష్టంతో 78,918.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315.45 పాయింట్ల నష్టంతో 24,450.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 91.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, రిలయన్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 86.98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5082 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కారణాలు ఇవీ..




ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం ఇప్పుడే ముగిసే సూచనలు కనిపించడం లేదు. అసలు యుద్ధం ఇప్పుడే మొదలైందంటూ అమెరికా రక్షణ మంత్రి పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇరాన్‌పై యుద్ధం విషయంలో టైమ్ లిమిట్ అంటూ ఏమీ పెట్టుకోలేదని వ్యాఖ్యానించడం యుద్ధం దీర్ఘకాలం కొనసాగొచ్చన్న అంచనాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తలతో చమురు ధరలు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగుతుండడం కూడా దిగుమతులపై ఆధారపడే మన దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న భయాలు నెలకొన్నాయి. ద్రవ్యోల్బణం, వృద్ధిపై భయాలు నెలకొన్నాయి.

దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో రూ.3762 కోట్ల విలువైన షేర్లు విక్రయించినట్లు ఎన్ఎస్ఈ డేటా చెబుతోంది. ఒక్క మార్చి నెల్లో రూ.21,436 కోట్ల విలువైన షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించడమూ ప్రతికూల ప్రభావం చూపింది.

## టాటా స్టీల్ రూ. 11,000 కోట్ల పెట్టుబడులు




అధునాతన గ్రేడ్ ఉక్కును తయారు చేసే దిశగా జంషెడ్‌పూర్ ప్లాంటుపై రూ. 11,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలు ఉన్నట్లు టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. ఇందుకోసం తాము రూపొందించిన టెక్నాలజీతో ఉక్కు ప్రాసెసింగ్ వేగవంతమవుతుందని, అలాగే కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయని చెప్పారు. నెదర్లాండ్స్‌లో ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం అయిన నేపథ్యంలో 2030 నాటికి జంషెడ్‌పూర్‌లో 1 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చంద్రశేఖరన్ చెప్పారు. హైడ్రోజన్ ట్రక్కులపై కూడా టాటా మోటర్స్ ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించారు. ఇక జార్ఖండ్‌లో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని టాటా గ్రూప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## గణనాధుని సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి




**కాణిపాకం, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాకం విచ్చేశారు. వీరిని ఆలయ ఏయూ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీధర్ నాయుడు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిత్తూరు కోర్టు న్యాయమూర్తులు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీటీడీ ఈవోగా ముద్దాడ రవిచంద్ర భాధ్యతల స్వీకారం



**తిరుమల, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ ముద్దాడ రవిచంద్ర శ్రీవారి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం ముందు ఈవో మీడియాతో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. శ్రీవారి భక్తులకు సాటి భక్తుడిగా సేవ చేస్తానని చెప్పారు. భక్తుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో భక్తులకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

## రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఏపి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం





**తిరుపతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ గారికి ఘన స్వాగతం లభించింది.గౌరవ రాష్ట్ర గవర్నర్ తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమ, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి భరత్ పుష్పగుచ్ఛాలతో గవర్నర్ గారికి స్వాగతం పలికారు.గవర్నర్ గారు తన పర్యటనలో భాగంగా రేపు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న 22వ కన్వొకేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.




## కాణిపాకంలో ఘనంగా సంకటహర చతుర్థి వ్రతం



**కాణిపాకం, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు గల ఆస్థాన మండపం నందు శుక్రవారం సంకటహర చతుర్థి సందర్భంగా వైభవంగా స్వామివారి సంకటహర గణపతి వ్రతం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, పర్యవేక్షకులు వాసు, కోదండపాణి, అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు విశ్వాసాన్ని కల్పించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత : జిల్లా ఎస్పీ

### - మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు ప్రత్యేక మెడికల్ క్యాంపు

**తిరుపతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది మహిళల భద్రత మరియు సాధికారతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు నేటి సమాజంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, నేరాలపై అప్రమత్తంగా ఉండే విధంగా చైతన్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మహిళా ప్రాంగణాలు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాలను సందర్శించిన మహిళా పోలీసులు మరియు పోలీసు అధికారులు మహిళలకు భద్రతకు సంబంధించిన అంశాలు, సైబర్ నేరాలు, మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. మహిళలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండి చట్టపరమైన సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో రాత్రిపూట గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తూ సమాజంలో మహిళల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ మహిళల భద్రతకు కట్టుబడి ఉందని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ గారి ఆదేశాలపై మహిళా డీఎస్పీ శ్రీమతి శ్రీలత గారి ఆధ్వర్యంలో తిరుపతి పోలీస్ మైదానంలో మహిళల కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో మహిళలకు రక్తపరీక్షలు, బీపీ,




షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ మెడికల్ క్యాంప్‌లో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారు మహిళా పోలీసు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, ఇక్కడికి విచ్చేసిన డాక్టర్లు మరియు మా పోలీస్ కుటుంబ సభ్యులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అన్నారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో ముందస్తుగా వారాంతరంగా వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసి జరుపుకుంటున్నామని తెలిపారు. మహిళలు నేటి సమాజంలో ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారని ఎస్పీ గారు పేర్కొన్నారు. అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా కుటుంబ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, అదే సమయంలో చదువు, ఉద్యోగం, సేవా రంగాలు తదితర అన్ని విభాగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ సమాజ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని అన్నారు. ప్రతి రంగంలో తమదైన శైలిలో ముందుకు సాగుతూ మహిళలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. సమాజంలో మహిళల భద్రత మరియు సాధికారత కోసం పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఎస్పీ గారు తెలిపారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బంది తమ ధైర్యం, నిబద్ధత, క్రమశిక్షణతో విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో మహిళా పోలీసులు ముందుండి పనిచేయాలని, ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మహిళా పోలీసు సిబ్బంది పోలీస్ శాఖకు ఒక ప్రత్యేక బలమని జిల్లా ఎస్పీ గారు పేర్కొన్నారు. ఈ ముఖ్యమైన రోజులలోనే కాకుండా నిరంతరం ఇలాంటి అవగాహన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. మహిళలు ఏ సమస్య ఎదురైనా పోలీసులను నమ్మకంగా సంప్రదించేలా విశ్వాసాన్ని కల్పించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. అనంతరం మహిళల సాధికారత, మహిళా భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని విశేష సేవలందించిన మహిళా సిబ్బందిని అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు, కార్యక్రమం ముగిసిన తరువాత మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహిళా సిబ్బందితో కలిసి భోజనం చేసి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. పోలీస్ కుటుంబ సభ్యులుగా ఎల్లప్పుడూ మీకు నేను అండగా ఉంటాననే భావన కలిగేలా సిబ్బందిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ సతీమణి ఎల్. శ్రీ ఇందు హారిక, ఆధనపు ఎస్పీ సతీమణి శ్రీ కీర్తి , విమలాకుమారి పాల్గొన్నారు. అదనపు ఎస్పీలువెంకట్రావు (పరిపాలన), రవిమనోహర్ ఆచారి (శాంతి భద్రతలు), శ్రీనివాసులు (క్రైమ్స్), పోలీస్ డాక్టర్ మాధురి, సీఐడీ డీఎస్పీ హేమలత, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తమిమ్ అహ్మద్, మహిళా పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చంద్రగిరిలో రూ.5 కోట్లతో అత్యాధునిక 'కైలాస ధామం' ఏర్పాటుకు ఎమ్మెల్యే పులివర్తి నాని శ్రీకారం

**- దాత రామచంద్రా రెడ్డి సహకారంతో 2.30 ఎకరాల్లో 'కైలాస ధామం' నిర్మాణం**
**- ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక చొరవపై సర్వత్రా హర్షం: వీరంగారి రమేష్ రెడ్డి**

**చంద్రగిరి , మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో సుమారు 2 ఎకరాల 30 సెంట్ల విస్తీర్ణంలో అత్యాధునిక 'కైలాస ధామం' (స్మశాన వాటిక) ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మేరకు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ వీరంగారి రమేష్ రెడ్డి వివరాలను వెల్లడించారు. ఒక సంఘటనతో మొదలైన ఆలోచన గతంలో టీడీపీ నాయకులు భాస్కర్, బన్నీలు ప్రమాదవశాత్తు మరణించినప్పుడు, వారి అంత్యక్రియలకు హాజరైన పులివర్తి నాని అక్కడి స్మశాన వాటిక దుస్థితిని చూసి చలించిపోయారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం ఒక అంతిమ యాత్ర వేదిక (కైలాస ధామం) నిర్మించాలని అప్పుడే నిర్ణయించుకున్నారు. సుమారు రూ. 5 కోట్లకు పైగా వ్యయంతో, ప్రభుత్వ సహకారంతో పాటు పలువురు దాతల భాగస్వామ్యంతో ఈ భారీ ప్రాజెక్టును చేపట్టారు. 2019లో ఓటమి ఎదురైనా అధైర్యపడకుండా ప్రజల్లోనే ఉండి, 2024లో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కైలాస ధామంలో



ఆహ్లాదకరమైన పార్కులు, స్నానపు గదులు, వేచి ఉండే గదులు మరియు అంత్యక్రియలకు అవసరమైన ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని" అనే వినూత్న కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ, ప్రజల సమస్యలను ఓపికగా విని, నేడు వాటి పరిష్కారం వైపు అడుగులు వేయడం జరిగిందని, నేడు ప్రజలు అడగకముందే వారి సమస్యలను గుర్తించి పరిష్కరించే నాయకుడిగా నాని గుర్తింపు పొందారని రమేష్ రెడ్డి కొనియాడారు. చంద్రగిరి పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలకు సమిష్టిగా ఏర్పాట్లు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ డా శ్రీధర్

**కడప/ఒంటిమిట్ట, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఒంటి మిట్ట లోని శ్రీ కోదండరామస్వామి ఆల యం లో జరగనున్న శ్రీ కోదండ రామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి, సీతారా ముల కళ్యాణోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమిష్టి గా సమన్వ యం తో ప్రత్యేక ఏర్పాట్లు చేయా లని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచిం చారు. గురు వారం సాయంత్రం ఒంటిమిట్ట టిటిడి అతిథి గృహం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జేఈవో వి. వీరబ్ర హ్మం,జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తదితర అధికారులతో కలిసి బ్రహ్మోత్స వాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ ఒంటి మిట్ట శ్రీ కోదం డరామ స్వామి ఆలయంలో మార్చి 26న అంకు రార్పణతో కార్యక్రమాలు ప్రారంభ మై, మార్చి 27నధ్వజారోహణంతో బ్రహ్మో త్సవాలు మొదలవు తాయని తెలిపా రు.ఏప్రిల్ 1న జరిగే శ్రీ సీతారాముల కళ్యాణో త్సవం లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పట్టు వస్త్రాల సమర్పణ జరగనుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన నేపథ్యంలో అందుకు అనుగుణం గా పటిష్ట బందోబస్తు వ్యవస్థ, హెలిప్యాడ్, భక్తుల రద్దీ నేపథ్యం లో ప్రశాం తంగా స్వామివారి దర్శన భాగ్యం కలిగేందుకు వీలుగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు టిటిడి జె ఈ ఓ వి.వీరబ్రహ్మం మాట్లాడుతూ, భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, గ్యాలరీ లు, పార్కింగ్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ వంటి ఏర్పాట్లు పటిష్టంగా ఉండా లని సూచించారు.ఈ సమా వేశం లో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయు డు, రాజంపేట సబ్ కలెక్టర్భా వన,టి టిడి సీఈ సత్యనా రాయణ, ఎస్ ఈలు మనోహరం, వేంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర కుమార్, సెల్వం, శివప్రసాద్, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి జి ఎల్ ఎన్ శాస్త్రి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


**- రూ.18 లక్షల రూపాయల జడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**



**సత్యవేడు, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పంచాయతీ ఇందిరాపురం కాలనీలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి భూమిపూజ జరిపి ప్రారంభించారు. శుక్రవారం ఇందిరాపురం ఎస్సీ కాలనీలో పలువురు టిడిపి నాయకులతో కలిసి జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో చిన్నఈటిపాకంలో మూడు లక్షలు,రాచపాలెంలో ఐదు లక్షలు, ఇందిరాపురంలో ఐదులక్షల రూపాయల వ్యయంతో సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నామన్నారు.అలాగే కాలమనాయుడుపేటలో మరో ఐదు లక్షల రూపాయలతో కల్వర్టు నిర్మిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆమె గుర్తు చేశారు. టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శంకర్ రెడ్డి సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.ఈ నేపథ్యం లో 18 లక్షల రూపాయల జడ్పీ నిధులతో నూతనంగా సిమెంట్ రోడ్లు,కల్వర్టుల నిర్మాణాలను చేపడుతున్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ అమాసరెడ్డి,రాజశేఖర్ రెడ్డి,సర్పంచ్లు గోవింద స్వామి,రూబన్,మాజీ సర్పంచ్ గోవిందస్వామి,శ్యామ్ ప్రసాద్ రెడ్డి,దేవేంద్ర రెడ్డి,దీనయ్య,కోటి,తిరుపాల్, తిరుమల,చెంగయ్య,శేఖర్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్నీ రంగాల్లో రాణించాలి

**- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**



**సత్యవేడు,మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులు అన్నీ రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయ బృందం వారిని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. శుక్రవారం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం కెవిబి పురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు అమరావతి లోని ఏపీ అసెంబ్లీ సందర్శనకు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడే సమావేశాల్లో పాల్గొంటున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు తో మాట్లాడి విద్యార్థులు శాసనసభా కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఉప సభాధిపతి రఘురామకృష్ణంరాజు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తో కలిసి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, అసెంబ్లీ నిర్వహణ, మరియు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల పాత్ర, చీఫ్ విప్ పనితీరు వంటి అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు మాట్లాడుతూ విద్యార్థులు కూడా భవిష్యత్తులో మంచి రాజకీయ నాయకులు కావాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.ఎమ్మెల్యే ఆదిమూలం విద్యార్థులకు అవసరమైన భోజనం, వసతుల ఏర్పాటులను దగ్గరుండి చూసుకున్నారు. తమకు శాసనసభా కార్యకలాపాల పట్ల పూర్తి అవగాహన కల్పించిన ప్రభుత్వానికి, ప్రత్యేకంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గారికి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027